సాక్షి
తిరుపతి

బుధవారం । 11 । డిసెంబర్ । 2024



ఏడు గంగలకు ముక్కంటి సారె

శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున ఏడు గంగమ్మలకు ముక్కంటి సారెను మంగళవారం సమర్పించారు. - 10లో



రాయితీపై సూక్ష్మసేద్యం పరికరాలు

రైతులకు రాయితీపై సూక్ష్మ సేద్యం పరికరాలు అందజేయనున్నట్లు ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు తెలిపారు. - 10లో



కోతకు 'పచ్చ' జెండా

కుంటి సాకులతో పేదల పింఛన్‌కు కోత పెట్టడానికి కూటమి సర్కారు పచ్చ జెండా ఊపేసింది. - 10లో

న్యూస్‌రీల్

14న జాతీయ లోక్ అదాలత్



జడ్జి గురునాథ్

తిరుపతి లీగల్ : నగరంలోని కోర్టు ఆవరణలో ఈ నెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ ఎం. గురునాథ్ మంగళవారం తెలిపారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవ సంస్థల ఆదేశాల మేరకు తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. కేసుల పరిష్కారం కోసం తొమ్మిది బెంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ బెంచ్‌లకు అధ్యక్షులుగా తనతోపాటు తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి విజయసారథిరాజు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ, జూనియర్ జడ్జీలు సత్య కాంత్ కుమార్ ,పి.కోటేశ్వరరావు, సంధ్యారాణి, గ్రంధి శ్రీనివాస్, వై.సరిత వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో కోర్టుల్లో పెండింగ్ ఉన్న సివిల్, వివాహ, మోటారు వాహన సంబంధ కేసులతోపాటు రాజీ కాదగిన క్రిమినల్ కేసులను, వ్యాజ్యం వేయని కేసులను పరిష్కరిస్తారన్నారు. న్యాయవాదులు, పోలీస్ అధికారులు, వివిధ సంస్థల అధికారులు, ఈ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం కావడానికి సహకరించాలని కోరారు.


శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 67,124 మంది స్వామివారిని దర్శించుకోగా 24,069 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.77 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలలో అనుమతించబోరని స్పష్టం చేసింది.

కొలువు కల్పనేనా!

ప్రభుత్వ ఉద్యోగం.. యువత లక్ష్యమిదే. వేలాది మంది నిరుద్యోగులు కొలువుల కోసం కష్టపడి చదివారు.. అప్పులు చేసి మరీ శిక్షణ పొందారు.. 2024 ముగుస్తోంది. అయినా ఒక్క ఉద్యోగానికీ నోటిఫికేషన్ జాడే లేదు. ఎన్నికల్లో ఏమో కూటమి నేతలు మెగా డీఎస్సీ అన్నారు.. లక్షల్లో ఉద్యోగాలన్నారు.. నేడు అంతా శూన్యం అయ్యింది. నిరుద్యోగ యువత పడిన కష్టం బూడిద పాలైంది. కొలువుల కల్పన కలగానే మిగిలింది.

- నోటిఫికేషన్ల మాటే లేదు
- ఈ ఏడాదిలో ఒక పోస్టూ భర్తీ చేయని సర్కారు
- తుంగలో తొక్కిన తొలి సంతకం
- నిరుద్యోగులకు శఠగోపం
- ప్రభుత్వంపై నిరుద్యోగులు ఆగ్రహం



తిరుపతి సిటీ: ఏపీపీఎస్సీ నుంచి 2024లో నోటిఫికేషన్లపై ఉలుకు పలుకు లేదు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ మాటే లేకుండా కాలయాపన చేస్తూ ఈ ఏడాదికి టాటా చెప్పేశారు కూటమి నేతలు. అధికారం చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీ, 2 లక్షల ఉద్యోగాల భర్తీ అంటూ నిరుద్యోగులను బురిడీ కొట్టించి శఠగోపం పెట్టారు. కాగా గత ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు నెలలు పూర్తి కాకుండానే ఏపీపీఎస్సీతో పాటు పలు ప్రభుత్వ శాఖల్లో సుమారు 2.50 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసింది. 1998 బ్యాచ్ క్వాలిఫైడ్ టీచర్లకు ఉద్యోగాలు కల్పించింది. జూనియర్, డిగ్రీ కళాశాల తాత్కాలిక అధ్యాపకులను రెగ్యులర్ చేసేందుకు ప్రక్రియ పూర్తి చేసింది. యూనివర్సిటీల్లో సుమారు 4 వేల అధ్యాపక పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. విద్య, వైద్య రంగాల్లో ఖాళీ పోస్టులను శాశ్వత, తాత్కాలిక ప్రాతిపదికన ఎప్పటికప్పుడు భర్తీ చేస్తూ వచ్చింది. సుమారు 16 లక్షల మంది నిరుద్యోగులకు ప్రత్యేక జాబ్‌మేళాలు నిర్వహించి ఎమ్‌ఎన్‌సీ కంపెనీల్లో ఉపాధి అవకాశాలను కల్పించింది. అయితే ప్రస్తుత కూటమి సర్కారు ఉద్యోగాల ఊసే ఎత్తలేదు.

నోటిఫికేషన్లు ఇలా..

ఏపీపీఎస్సీ :	నిల్
ఉపాధ్యాయ పోస్టులు:	నిల్
తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్:	నిల్
పోలీసు శాఖ:	నిల్
విద్య, వైద్యం, సంక్షేమ శాఖ:	నిల్
టీటీడీ, ధార్మిక సంస్థ:	నిల్

తొలగించిన ఉద్యోగుల వివరాలివీ..

అన్ని ప్రభుత్వ శాఖల్లో తాత్కాలిక ఉద్యోగులు 3,560	పలు శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు 1,890
వలంటీర్లు 16,657	గ్రామసమాఖ్య సహాయకులు (వీఏఓ) 201
ఫీల్డ్ అసిస్టెంట్లు (బెదిరింపులతో) 76	నౌకర్ నామా (వైన్‌షాపు ఉద్యోగులు) 1,088
రేషన్‌షాపు డీలర్లు 151	విద్యాసంస్థల్లో 602
మొత్తం ఉద్యోగుల సంఖ్య : 24,225	

25 వేల మంది ఉద్యోగుల తొలగింపు

తిరుపతి జిల్లా వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఆరు నెలల్లో సుమారు 25 వేల మందికి పైగా ఉద్యోగులను తొలగించింది. దీంతో వేలాది మంది చిరుద్యోగులు రోడ్డున పడ్డారు. 16 వేల మందికి పైగా వలంటీర్లు, 5 వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, 151 మంది రేషన్ డీలర్లు, ప్రభుత్వ వైన్‌షాపుల్లో పనిచేస్తున్న 1,088 మంది చిరుద్యోగులు, 200 మంది వీఏఓలు కూటమి ప్రభుత్వ వికృత చేష్టలకు బలయ్యారు. గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, వర్సిటీలు, విద్య, వైద్య రంగాల్లో పనిచేస్తున్న సుమారు 2 వేల మందిని బెదిరించి, తప్పించారు. గతంలో ప్రభుత్వాలు మారినా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన ఘటనలు లేవని ఉద్యోగులు, సామాన్య ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి



ఏడాది మొత్తం ఒక్క ప్రభుత్వ ఉద్యోగానికి కూడా నోటిఫికేషన్ విడుదల చేయకుండా, ఒక్క పోస్టూ భర్తీ చేయకుండా కూటమి సర్కార్ రికార్డు సృష్టించిందని చెప్పవచ్చు. రాష్ట్ర చరిత్రలో ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ లేదు.ఇదే తొలిసారి. కనీసం ప్రతి ఏడాది ఏపీపీఎస్సీ ద్వారా ఏదో ఒక నోటిఫికేషన్ వెలువడేది. అయితే గత ఆరు నెలలుగా కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోలేదు. నిరుద్యోగ భృతి హామీపై నీళ్లు చల్లింది. 2024 సంవత్సరం ఉద్యోగార్థులకు నిరాశ మిగిల్చింది.

-ఆర్ సుకుమార్ యాదవ్, తిరుపతి

నీరుగారిన తొలి సంతకం



మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసిన సీఎం ఆ మాటను నిలబెట్టుకోలేపోయారు. ఇక తొలి సంతకం హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి పోయింది. జిల్లాలో నా లాంటి వేలాది మంది డీఎస్సీ నోటిఫికేషన్ కోసం రూ.లక్షలు ఖర్చుపెట్టి ఇతర ప్రాంతాల్లో శిక్షణ పొందారు. ఈ ఏడాది నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను మభ్యపెట్టి త్వరలో విడుదల చేస్తామని చెబుతున్నారు. దీంతో నిరుద్యోగుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. మెగా డీఎస్సీ అని కేవలం 16 వేలు టీచర్ పోస్టులు భర్తీ చేస్తామనడం ఎంతవరకు సమంజసం.

-కే శ్రీలేఖ, తిరుపతి

నిరుద్యోగుల కడుపుకొట్టారు



2024లో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తిగా నిలిపివేశారు. నోటిఫికేషన్లు విడుదల చేయకుండా నిరుద్యోగుల కడుపుకొట్టారు. గత ప్రభుత్వం జనవరిలో విడుదల చేసిన 3 వేలకు పైగా యూనివర్సిటీ అధ్యాపక పోస్టుల నోటిఫికేషన్‌ను సంబంధించి నియామకాలు చేపట్టకుండా కుట్రతో నూతన ప్రభుత్వం ఆపివేసింది. ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ పూర్తి చేసి ప్రొఫెసర్ ఉద్యోగం కోసం ఎదురుచూశాను. ప్రభుత్వం నిరుత్సాహం మిగిల్చింది. వచ్చే ఏడాదిలోనైనా పోస్టులు భర్తీ చేయకుంటే నిరుద్యోగుల ఆగ్రహానికి గురి కాక తప్పదు.

-ఎస్ ప్రవల్లిక, శ్రీకాళహస్తి

ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టారు



కూటమి ప్రభుత్వం వస్తే ఉద్యోగాలకు భరోసా ఉంటుందని భావించా. నేను ఓ ప్రభుత్వ విద్యా సంస్థలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా గత 4 ఏళ్లుగా పనిచేశాను. ఉన్నఫలంగా రెండు నెలలకు ముందు ఉద్యోగం నుంచి తొలగించారు. ఎందుకు తొలగించారో అర్థం కావడం లేదు. జిల్లాలో నాలా వందలాది మంది జీవితాలపై కూటమి ప్రభుత్వం కక్ష గట్టి కడుపుకొట్టింది. శాశ్వత ఉద్యోగాల కోసం ప్రయత్నించేందుకు ఏడాదిగా ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయలేదు. 20 వేల మందికి పైగా తాత్కాలిక ఉద్యోగులను ప్రభుత్వం తొలగించింది.

-ఎస్ విశ్వనాథ్, తిరుపతి

సీఎం సమాధానం చెప్పాలి



ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏడాదిగా కష్టపడి చదివాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క ఉద్యోగానికి నోటిఫికేషన్ రాకపోవడం బాధ కలిస్తోంది. ఏడాదిపాటు ఉద్యోగల భర్తీ లేకుంటే నిరుద్యోగుల పరిస్థితి ఏమిటన్నది ప్రభుత్వాలు ఆలోచించాలి. కనీసం నిరుద్యోగ భృతి ఇస్తారని ఎదురు చూశాం. ప్రభుత్వ పెద్దలు ఆ ఊసే ఎత్తిన పాపాన పోలేదు. ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని భావించి ఓట్లు వేసి నిరుద్యోగ యువతకు సీఎం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

-పి నీలాంబరి, తిరుపతి రూరల్

రైతు ద్రోహి చంద్రబాబు



రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ నాయకులు బొమ్మగుంట రవి, అజయ్‌కుమార్

- ఆర్థిక సాయం ఎక్కడ బాబూ ?
- అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ ఉద్యమబాట
- ఈనెల 13వ తేదీ జిల్లా కలెక్టర్లకు వినతులు
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : దేశానికి వెన్నెముక రైతన్న అన్న విషయాన్ని మరిచిన రైతు ద్రోహి చంద్రబాబు అని, గతంలో వ్యవసాయమే దండగ అన్న దుర్మార్గుడు కూడా ఆయనే అని వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. తిరుపతిలోని భూమన నివాసంలో మంగళవారం భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో కేవలం అధికార దాహంతో జనసేన, బీజేపీలతో పొత్తులు పెట్టుకుని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలు, రైతులకిచ్చిన హామీలను గాలికి వదిలేశారన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయలేదని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలోనూ చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారన్నారు. రైతాంగం గురించి తనకు తెలిసినంతగా మరొకరికి తెలియదని చెప్పుకునే చంద్రబాబు రైతులను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో రైతులకు ఉచిత కరెంట్ ఇస్తామని చెబితే కరెంట్ తీగలపై దుస్తులు ఆరేసుకోవచ్చని చంద్రబాబు హేళనగా మాట్లాడారని గుర్తుచేశారు. అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ఉచిత కరెంట్‌పై మొదటి సంతకం చేసి తొమ్మిది గంటల పాటు నిరంతరాయంగా కరెంట్ అందించిన ఘనత వైఎస్సార్ దేనన్నారు. అయితే రైతులకు రూ. 20వేలు ఆర్థిక సాయం అందిస్తానని చెప్పిన చంద్రబాబు మరోసారి రైతులను మోసగిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ నిలబడుతుందన్నారు. ఈనెల 13వ తేదీన ప్రతి జిల్లాలోని కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించి, ఉద్యమబాట చేపడుతున్నామన్నారు. చిత్తూరు ఉమ్మడి జిల్లా నుంచి తమ నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో తిరుపతి కలెక్టర్‌కు తనతో పాటు మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ మంత్రి ఆర్ కే రోజా, నియోజకవర్గాల సమన్వయకర్తలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఎస్ రాజేష్, చిత్తూరు జిల్లాలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, డాక్టర్ సునీల్, విజయానందరెడ్డి, భరత్, వెంకటేగౌడ జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని అబద్ధపు హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.15 వేల కోట్లు విద్యుత్ చార్జీలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా ఈ నెల 27 వ తేదీన జిల్లాలోని అన్ని డిస్కంల వద్ద ధర్నాలు చేసి, వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కూటమిలో అసమ్మతితోనే నాగబాబుకు మంత్రి పదవి ప్రకటన

నాగబాబుకు మంత్రి పదవి ఇస్తానని సాక్ష్యాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం కూటమి ప్రభుత్వంలో అసమ్మతి తారాస్థాయికి చేరిందనడానికి నిదర్శనమని భూమన కరుణాకరరెడ్డి అన్నారు. 76 ఏళ్ల దేశ రాజకీయ చరిత్రలో ఇంతవరకు ఏ రాజకీయ పార్టీ ఎవరికీ మంత్రి పదవి ఇస్తామని ముందస్తుగా ప్రకటన చేయలేదన్నా రు. కేవలం టీడీపీ, జనసేన పార్టీల మధ్య ఉన్న విభేదాల కారణంగానే నాగబాబుకు మంత్రి పదవి ఇస్తానని చెప్పారన్నారు. నందమూరి తారకరామారావు చనిపోయినప్పుడు ఆయన కుమారుడు హరికృష్ణను మంత్రివర్గంలోకి తీసుకుంటున్నామని కూడా ప్రకటన చేయని చంద్రబాబు నాగబాబుకు మంత్రి పదవి ఇస్తానని చెప్పడం చూస్తే వారి మధ్య ఏ స్థాయిలో విభేదాలు ఉన్నాయో అర్థమవుతుందన్నారు. కేవలం పవన్‌కళ్యాణ్‌ను బుజ్జగించడానికే నాగబాబుకు మంత్రి పదవి ఇస్తానని చంద్రబాబు చెప్పినట్లు తెలుస్తోందన్నారు. పార్టీ సీనియర్ నేత బొమ్మగుంట రవి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బాల్యం.. మూడు ముళ్ల బంధం

- వరదయ్యపాళెం మండలానికి చెందిన 16 ఏళ్ల బాలికకు సమీప బంధువుతో తల్లిదండ్రులు వివాహం జరిపించారు. వివాహం ఇష్టం లేదని ఏడ్చి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. పైగా తాము నిశ్చయించిన వివాహం చేసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటామని తల్లి, నానమ్మ హెచ్చరించడంతో బాలిక వివాహం చేసుకోక తప్పలేదు.
- తిరుపతిలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి పదో తరగతి పూర్తయిన 15 ఏళ్ల బాలికను ప్రసవం కోసం తీసుకురావడంతో వైద్యులు నివ్వెరపోయారు. తమకు కుదరదని చెప్పడంతో వారు వెనక్కి తీసుకెళ్లి ఓ ఆర్‌ఎంపీతో డెలివరీ చేయించారు. ఈ విషయం బాలిక నివసిస్తున్న గ్రామంలో ఐసీడీఎస్, అంగన్‌వాడీ సిబ్బందికి తెలియకపోవడం గమనార్హం.



ఆర్థిక సమస్యలు.. ఆచార వ్యవహారాలు.. సమాజంలో మూఢత్వం..ఏదైతేనేమీ బంగారు బాల్యం.. బాంధవ్యం అనే మూడు ముళ్ల బంధనంలో చిక్కుకుపోతోంది. పసిప్రాయం పలుపు(పసుపు) తాళ్లకు బలైపోతోంది. బడిబాట పట్టాల్సిన చిన్నారులు అత్తారిళ్లలో నానా అవస్థలు పడుతున్నారు.

- కలవరపెడుతున్న బాల్య వివాహాలు
- రెండేళ్లలో అధికారులు అడ్డుకున్న బాల్యవివాహాలు 151
- జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీ కేసులు 192
- పెరుగుతున్న మాతా శిశుమరణాలు
- రెండేళ్లలో 52 మంది మృతి
- చట్టాలున్నా చట్టుబండలే!

తిరుపతి రూరల్: ప్రపంచం సాంకేతిక పరిజ్ఞానంతో ఎంత ముందుకెళ్లినా.. ఇంకా కొందరి ఆలోచనల్లో మార్పు రావడం లేదు. చిన్నారి పెళ్లి కూతురికి పుస్తెల బంధనం తప్పడం లేదు. ఇందుకు నిరక్షరాస్యత, పేదరికం కొంత కారణం కాగా.. తల్లిదండ్రుల ఆలోచనా విధానం మరో ప్రధాన కారణం. తమ బాధ్యత తీరిపోతుందని భావిస్తున్న కొందరు తల్లిదండ్రులు, ఆడపిల్లలకు పెళ్లీడు రాక ముందే వివాహాలు చేస్తున్నారు. ఫలితంగా బాల్యం బందీ అవుతోంది.

అడ్డుకున్నా.. ఆగలేదు

జిల్లాలో 151 బాల్య వివాహాలను ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. అయినా ఆగడం లేదు. అధికారులు తమకున్న సమాచారంతో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో కొంతవరకు బాల్య వివాహాలు తగ్గినట్టు కనిపిస్తున్నా, లోలోపల గుట్టుచప్పుడు కాకుండా చేస్తున్నారు. ఇందుకు ఆర్థిక ఇబ్బందులే కారణంగా తెలుస్తోంది. ఆర్థికంగా వెనుకబడినవారు ధనికులకు తమ కుమార్తెలను ఇచ్చి పెళ్లి చేస్తే, అమ్మాయి జీవితం బాగుంటుందని భావిస్తున్నారు. పెద్దయితే తాము చెప్పిన సంబంధం చేసుకుంటుందో లేదోనన్న ఆలోచనతో మరి కొందరు, ప్రేమలో పడి తమకు చెడ్డ పేరు తెస్తుందేమోనన్న భయంతో ఇంకొందరు.. చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేస్తున్నారు.

అత్యంత దుర్భరం

బాల్య వివాహాలు చేసుకున్న అమ్మాయిల పరిస్థితి అత్యంత దుర్భరంగా ఉంది. వారు సంసారం, కుటుంబం, పిల్లల బాధ్యత మోస్తూనే అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. చిన్న వయస్సులో గర్భం దాలిస్తే తల్లీబిడ్డకు ప్రాణాపాయం ఉంటుంది. జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీ కేసులు 192 నమోదు అయ్యాయి. జిల్లాలో ఇలా టీనేజ్ ప్రెగ్నెన్సీతో 52 మాతాశిశు మరణాలు జరిగాయి. ఈ నేపథ్యంలో బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి నెలా రెండో వారంలో జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, స్కూళ్లలో, అంగన్‌వాడీ పరిధిలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖాధికారులు అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు.

రెండేళ్ల శిక్ష, రూ.లక్ష జరిమానా

బాల్య వివాహలను అరికట్టేందుకు కఠినమైన చట్టాలున్నాయి. అయినా అవి చట్టబండలుగానే మిగిలిపోతున్నాయనే విమర్శలున్నాయి. బాల్య వివాహం చట్టరీత్యా నేరం. పెళ్లి చేసినా, ప్రోత్సహించినా రెండేళ్ల వరకు జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా ఉంటుంది. బాల్య వివాహాల నిర్మూలన, బాలల సంరక్షణ కోసం 1098 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంది. సమాచారం అందిస్తే సంబంధిత అధికారులు ఆ వివాహాన్ని అడ్డుకుని, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు 18 ఏళ్లు నిండే వరకు బాలికకు వివాహం చేయబోమని ఒప్పంద పత్రం రాయించుకుంటారు.

బాల్య వివాహ రహిత జిల్లాగా తిరుపతి



జిల్లాలోని ఐసీడీఎస్, పోలీస్, సచివాలయం ఉద్యోగులతో పాటు మహిళా సంఘాల ప్రతినిధులు సైతం బాల్య వివాహాలను అడ్డుకోవడంలో భాగస్వాములు కావాలి. బాల్య వివాహాలు ఎక్కువగా శ్రీకాళహస్తి ప్రాంతంలో జరుగుతున్నట్లు రికార్డులు చెపుతున్నాయి. ఉద్యోగులు సమన్వయంతో పాటు ప్రజల భాగస్వామ్యంతో రానున్న రోజులో బాల్యవివాహల రహిత జిల్లాగా తిరుపతిని తీర్చిదిద్దుతాం.

– డాక్టర్ వెంకటేశ్వర్, కలెక్టర్, తిరుపతి జిల్లా

టీనేజ్ ప్రెగ్నెన్సీతో ప్రాణానికే ప్రమాదం



బాల్య వివాహాలతో వచ్చే గర్భాల కారణంగా బాలికలు ఎనిమియా బారిన పడే ప్రమాదం ఉంది. ప్రసవం సమయంలో అధిక రక్తస్రావం, అధిక రక్తపోటుతో ప్రసూతి మరణాలు జరుగుతాయి. బిడ్డను మోసే సామర్థ్యం బాలికలకు తక్కువగా ఉంటుంది. టీనేజ్ ప్రెగ్నెన్సీ కారణంగా బిడ్డతో పాటు తల్లి ప్రాణానికి కూడా ప్రమాదమే.

-డాక్టర్ ప్రియాంక, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ, కొటాల

బాల్యవివాహాలను ఆపుతున్నాం



బాల్య వివాహాలు జరిగినట్టు తెలిస్తే మా దృష్టికి తీసుకురావాలి. వెంటనే ఆ సమాచారాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లి పెళ్లిని ఆపివేస్తాం. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తాం. తగిన వయసు లేకపోతే మానసిక, శారీరక పరిపక్వత ఉండదు.

–జయలక్ష్మి, పీడీ, ఐసీడీఎస్, తిరుపతి

అందరూ బాధ్యులే



బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం. బాల్య వివాహం జరిపించిన తల్లిదండ్రులు, పురోహితులు, స్నేహితులు, అనుమతించిన పెద్దలు, సహకరించిన వారు కూడా నేరస్తులే అవుతారు. మైనర్ బాలికను పెళ్లి చేసుకొని సంసారం చేస్తే పోక్సో కేసు నమోదవుతుంది.

–రవిమనోహరాచారి, ఏఎస్పీ, తిరుపతి

కోతకు 'పచ్చ' జెండా

మీ ఇంట్లో ప్రైవేటు ఉద్యోగి ఉన్నాడా..? ఇంటి స్థలం ఉందా? విద్యుత్ బిల్లు అధికంగా వస్తుందా.. అయితే పింఛన్ గోవిందా..! ఇలా పేదలను వేధించిన సంఘటనలు గతంలో చూశాం.. నేడు మళ్లీ ఆ పరిస్థితి పునరావృతం అవుతోందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. తిరుపతి జిల్లాలో ఇప్పటికే ఆరు వేలకు పైగా పింఛన్లకు కోత పడగా మళ్లీ సర్వేలతో పింఛన్లకు కోత పెట్టడానికి కూటమి సర్కారు పచ్చజెండా ఊపింది. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

- పింఛన్ల ఏరివేతకు కూటమి సర్కార్ రంగం సిద్ధం
- పైలెట్ ప్రాజెక్టుగా సూరప్పకశంలో పరిశీలన
- రెండు, మూడు దశల్లో పింఛన్లపై సర్వేలు



తొమ్మిది బృందాల్లో 18 మందికి పింఛన్ల తనిఖీలపై సూచనలు చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు(ఫైల్)

తిరుపతి అర్బన్: ఎన్నికల ముందు సంక్షేమ పథకాలతో ఊరించిన చంద్రబాబు గద్దెనెక్కిన తరువాత అన్నింటినీ విస్మరిస్తున్నారు. అందరూ ఊహించినట్లుగానే పింఛన్లు ఏరివేతకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అనర్హులకు పింఛన్లు ఇస్తున్నారంటూ కూటమి సర్కార్ గద్దెనెక్కిన నాటి నుంచే పింఛన్లకు కత్తిరేయడం మొదలుపెట్టింది. ఈ ఏడాది జూన్‌లో 2,71,183 మందికి పింఛన్లు ఇచ్చారు. ఈ ఏడాది డిసెంబర్‌లో 2,64,636 మందికి పింఛన్లు అందించారు. కేవలం ఆరు నెలల వ్యవధిలో 6,547 మందికి పింఛన్లు తగ్గించిన సంగతి తెలిసిందే. అది చాలదంటూ ఇంకా అనర్హులున్నారంటూ పింఛన్ల తొలగింపునకు సర్వేలు మొదలుపెట్టారు. మొదటి దశగా జిల్లాలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకునే క్రమంలో రేణిగుంట మండలంలోని సూరప్పకశం గ్రామాన్ని ఎంపిక చేశారు. శని, సోమ వారాల్లో(ఈ నెల 7,9 తేదీల్లో పూర్తి) సూరప్పకశంలో 354 పింఛన్లను 9 బృందాల సభ్యులు 18 మంది సర్వే చేశారు. అందులో 15 మంది పింఛన్లకు అనర్హులుగా గుర్తించారు. మరో ఐదుగురు గ్రామంలో లేరని నిర్ధయించారు. మొత్తంగా 354 మంది పింఛన్ లబ్ధిదారుల్లో 20 మంది పింఛన్లకు గండికొట్టారు. అంటే 6 శాతం మందికి పింఛన్ల గండం తప్పలేదు. వచ్చే ఏడాది జనవరి నుంచి 2, 3 దశల్లో జిల్లా వ్యాప్తంగా పింఛన్ల తనిఖీ ఉంటుందన్న చర్చసాగుతుంది. అదే జరిగితే జిల్లాలోని 2,64,636 మంది పింఛన్ లబ్ధిదారుల్లో 6 శాతం మంది, ఆ లెక్కన చూస్తే 15,878 మందికి పింఛన్ల గండం తప్పేలాలేదని చర్చసాగుతుంది.

బాబు గారి గత పాలన గుర్తుకొస్తుందా?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు పాలనలో ఒకరికి పింఛన్ ఇవ్వాలంటే.. అదే గ్రామంలో పింఛన్ తీసుకునే వ్యక్తి ఒకరు మృతి చెందితేనే ఇంకో వ్యక్తి ఇస్తామని చెప్పిన మాటలు మళ్లీ గుర్తుకొస్తున్నాయి. ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో అర్హతను ప్రామాణికంగా తీసుకుని, అందరికీ పింఛన్లు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే.

2024 సార్వత్రిక ఎన్నికల్లో 45 ఏళ్లకు పింఛన్లు సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు 45 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పింఛన్లు మంజూరు చేస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. అయితే ఆ హామీని ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత మరచిపోయారు. గత ఐదేళ్లలో ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్లు మంజూరు చేశారు. అంటే జనవరి–జూన్ వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, జూలైలోను, జూలై– డిసెంబర్ వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి జనవరిలో కొత్త పింఛన్లు ఇచ్చేవారు. గత ఐదేళ్లలో ఏటా 11 వేల(రెండు దశల్లో) చొప్పున కొత్త పింఛన్లు ఇచ్చారు. అయితే కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క కొత్త పింఛన్ ఇవ్వలేదు. ఆరు నెలల్లో నెలకు 1000కి పైగా 6,547 పింఛన్లు తొలగించారు. అది చాలదంటూ సర్వేల పేరులో మరో 16 వేలకు పైగా పింఛన్లకు గండిపడుతుందని అంతా ఆందోళన చెందుతున్నారు. కొత్త పింఛన్లకు సంబంధించి ఇటీవల నవంబర్ 1 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు మాత్రమే వితంతువులుగా మారిన వారు పింఛన్‌కు దరఖాస్తులు చేసుకోవాలని ఉత్తర్వులు ఇవ్వడం విడ్డూరంగా ఉందని పలువురు మండిపడుతున్నారు.

పరిశీలనలో గమనిస్తున్న అంశాలు

- పింఛన్ తీసుకుంటున్న కుటుంబంలో ఎవరైనా ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నారా?
- అర్బన్ ప్రాంతంలో 1000 చదరపు అడుగుల కంటే ఎక్కువగా ఇంటి నిర్మాణం ఉందా?
- విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్లు కంటే ఎక్కువ వాడుతున్నారా?
- లబ్ధిదారుడి కుటుంబంలో ఎవరికైనా 4 చక్రాల వాహనం(ట్యాక్సీ, ట్రాక్టర్లు తదితర వాహనం) ఉందా?
- 3 ఎకరాలు కంటే ఎక్కువ మాగాణి, 10 ఎకరాలు కంటే ఎక్కువ మెట్ట, రెండు కలిపితే 10 ఎకరాలు కంటే ఎక్కువ ఉందా?
- కుటుంబంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి లేదా పెన్షనర్లు ఉన్నారా?
- కుటుంబంలో ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారా?
- వితంతువు, ఒంటరి మహిళా పునర్వివాహం చేసుకున్నారా?
- దివ్యాంగులకు సంబంధించి వైకల్యం కలిగి ఉన్నారా?
- వివరాలు సేకరించిన పింఛన్ లబ్ధిదారుల నుంచి యాప్‌లో ఫేషియల్, బయోమెట్రిక్ తీసుకునే కార్యక్రమాలు చేస్తున్నారు.

క్లుప్తంగా

పంట బీమాకు దరఖాస్తు చేసుకోండి



ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

తిరుపతి అర్బన్: రబీ సీజన్ 2024–25కి సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా రైతులు తాము సాగు చేసిన పైర్లకు పంట బీమా నమోదు కోసం దరఖాస్తు చేసువచ్చని జిల్లా వ్యవసాయశాఖాధికారి(డీఏఓ) ఎస్. ప్రసాద్‌రావు వెల్లడించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వేరుశనగ, మామిడికి ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉందని చెప్పారు. వరి పంటకు ఈ నెల 31 వరకు సమయం ఉందని తెలిపారు. రబీ సీజన్‌కు సంబంధించి వరి పంట ఎకరానికి రూ. 630 ప్రీమియం చెల్లించాలని చెప్పారు. పంట బీమా 42 వేలుగా నిర్ణయించారని వెల్లడించారు. వేరుశనగకు ఎకరానికి ప్రీమియం రూ. 450 చెల్లించాలని తెలిపారు. పంట బీమా రూ.30 వేలుగా నిర్ణయించాలని పేర్కొన్నారు. మామిడి ఎకరానికి రూ.1,750 ప్రీమియం చెల్లించాలని చెప్పారు. పంట బీమా రూ.35 వేలుగా నిర్ణయించారని వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో లేదా వ్యవసాయశాఖ ఉద్యోగులను సంప్రదిస్తే బీమా నమోదు వివరాలను వెల్లడిస్తారని ఆయన వివరించారు.

రెవెన్యూ సదస్సులో కక్ష సాధింపులా?

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని బోనుపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సాక్షిగా మాజీ సర్పంచ్, టీడీపీ మరో వర్గం వ్యక్తితో గొడవ పడడంపై సర్వత్రా విమర్శలకు దారి తీసింది. రెవెన్యూ సదస్సులు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం పెడితే అయితే అందుకోసం కాకుండా కక్ష సాధింపు కోసం పెట్టినట్లుగా అదే సభలో ఇద్దరిపై కేసులు నమోదు చేయమని ఎలాంటి విచారణ జరగకుండా సభ సాక్షిగా చెప్పడం కలకలం రేపింది. తొట్టంబేడు మండలం బోనుపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు పెట్టాలని పదే పదే బొజ్జల సుధీర్‌రెడ్డి చెప్పడం ఓ దళిత రైతుకు సంబంధించి భూవివాదంలో వైఎస్సార్ సీపీ వ్యక్తిగా ముద్ర వేసి, కేసు నమోదు చేయమని పోలీసులకు ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించడానికి ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులు వైఎస్సార్ సీపీ వారిపై అనేక కేసులు పెట్టవచ్చని తెలుగుదేశం నాయకులు అనుకున్నది జరగకపోవడంతో ఎమ్మెల్యే నేరుగా కేసులు పెట్టమని పోలీసులను పురామాయించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. సభసాక్షిగా మాజీ సర్పంచ్ గొడవ పడడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

13న బీఈడీ కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో బీఈడీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు ఇవ్వనున్నట్టు రిజిస్ట్రార్ భూపతినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎడ్‌సెట్–2024లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 13న వర్సిటీలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ఉదయం 10గంటలకు హాజరు కావాలని కోరారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ ర్యాంక్ కార్డుతో పాటు, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి తుడా: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో రుయాలోని బాల భవిత కేంద్రంలో విద్యార్థుల రవాణా కోసం హైరింగ్ (కాంట్రాక్ట్)వాహనం ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 నుంచి 16 సీట్లు సామర్థ్యం కలిగి ఉండాలన్నారు. వాహనానికి నెలకు రూ.60 వేలు అద్దె చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు బాల భవిత కేంద్రం మేనేజర్ 9500030133 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

నేటి నుంచి వెటర్నరీలో జాతీయ సదస్సు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ కళాశాలలో పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల పరిశోధనలకు సంబంధించి బుధవారం నుంచి రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'మైల్‌స్టోన్ ఇన్ వెటర్నరీ రీసెర్చ్, అప్లికేషన్ ఫర్ ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ అనిమల్ హెల్త్ అండ్ ప్రొడక్షన్' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి సుమారు 150మంది పరిశోధక విద్యార్థులు ఈ సదస్సులో తమ పరిశోధన పత్రాలను సమర్పిస్తారని తెలిపారు.

తాత్కాలిక అధ్యాపక పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నేడు

తిరుపతి సిటీ: ఎస్వీ వేదిక్ వర్సిటీలో పార్ట్‌టైమ్ లెక్చరర్ పోస్టులకు బుధవారం వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో పంచరత్న, పూర్వ మీమాంస, కల్ప, అధర్వణ వేద విభాగాలలో ఒక్కో పోస్టు, శుక్ల యజుర్వేద భాష్యంలో రెండు పార్ట్‌టైమ్ లెక్చరర్ పోస్టులు ఖాళీలు ఉన్నట్లు తెలియజేశారు. మరిన్ని వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

సమానత్వం కోసం పోరాడిన నేత బాలయ్య

వరదయ్యపాళెం: అంబేడ్కర్ వాదిగా సమాజంలో సమానత్వం కోసం పోరాడిన వ్యక్తిగా, పేద ప్రజల కష్టాలకు అండగా నిలిచి, వారి అభ్యున్నతికి తోడ్పాటునిచ్చిన గొప్ప నాయకుడు బందిల బాలయ్య అని రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి అన్నారు. కంచరపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బందిల బాలయ్య మరణించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం కంచరపాళెంలోని బందిల బాలయ్య స్వగృహానికి చేరుకుని, వారి కుమారులు బందిల కుమార్, బందిల సురేష్, కుమార్తె షర్మిల తదితరులను పరామర్శించి, ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గాని, అంతకు ముందు తన రాజకీయ ప్రస్థానంలో బాలయ్య తనతో నడిచారని, తనకు అన్ని విధాలా సహకరించారన్నారు. పేదల కోసం పోరాడి కంచరపాళెం పంచాయతీ, పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం తపన పడిన బాలయ్య పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట జేసీఎస్ కన్వీనర్ చిన్న, సింగిల్ విండో మాజీ చైర్మన్ హరిబాబు రెడ్డి, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, పార్టీ నేతలు కుప్పయ్య, ప్రతాప్, శిబి చక్రవర్తి, ఎత్తి రాజులు, తదితరులు పాల్గొన్నారు.



బాలయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి

మృతదేహం అప్పగింత



శ్రావణి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

చంద్రగిరి: అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన యువతి మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం పూర్తి చేసి, బంధువులకు అప్పగించారు. మండలంలోని కోదండరామాపురం సమీపంలోని జాతీయ రహదారిపై పాకాల మండలం కే.వడ్డేపల్లికి చెందిన శ్రావణి(23) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. తిరుపతి నుంచి ద్విచక్ర వాహనంలో ఆమెను తీసుకొచ్చిన కార్తీక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. దీంతో మృతదేహాన్ని సోమవారం రాత్రి తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మంగళవారం కానిస్టేబుల్ సుబ్రమణ్యం పోస్టుమార్టం పూర్తి చేయించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. త్వరలో వివాహం చేసి అత్తగారింటికి పంపుదామనుకున్నాము తల్లీ.. ఇప్పుడు కాటికి పంపించాల్సి వచ్చిందా దేవుడా..! అంటూ కుటుంబ సభ్యులు ఆక్రందనలు మిన్నంటాయి. అయితే శ్రావణి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ బిడ్డను కార్తీక్ అనే యువకుడే హతమార్చాడంటూ వారు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు

తిరుపతి రూరల్: ఉపాధి హామీ పనుల్లో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఇందుకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు. రూ.8.87 కోట్లు ఖర్చుతో చేసిన 1,358 పనుల్లో తూతూ మంత్రంగా కేవలం రూ.11,093 రికవరీ చేశారు. మండలంలోని పలు పంచాయతీల్లో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రూ.8.87 కోట్ల నిధులతో చేపట్టిన 1358 పనులను గత నెల 6 నుంచి 18వ తేదీ వరకు ఎస్సార్పీ రవి ఆధ్వర్యంలో 12 మంది డీఆర్పీలు సామాజిక తనిఖీలు చేశారు. తిరుపతి రూరల్ మండలంలో ఎస్సార్పీ రవి ఆధ్వర్యంలో సామాజిక తనిఖీలు చేపట్టారు. పలుచోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. రూ.11,093 రికవరీ చేయాలని సూచించారు. అలాగే గొల్లపల్లి పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ రమాదేవి అవినీతికి పాల్పడినట్టు గుర్తించారు. ఒకరు చేసిన పనులను మరొకరి పేరిట బిల్లులు పెట్టి నిధులు దుర్వినియోగం చేస్తున్నట్లు నిర్ధారించారు. దీంతో రమాదేవిని సస్పెండ్ చేస్తూ పీడీ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి శివయ్య, ఎంపీపీ వేముల యశోద, జెడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీడీఓ రామచంద్ర, ఏపీఓ మమతరాణి, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, చిత్రంలో ఎంపీపీ వేముల యశోద

ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్

తిరుపతి అర్బన్: భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల్లోని ఉప–వర్గీకరణపై విచారణ చేపట్టడానికి ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి చెన్నయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో రాజీవ్ రంజన్ మిశ్రా(రిటైర్డ్ ఐఏఎస్) అధికారి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ మంగళవారం నుంచి వచ్చే ఏడాది జనవరి 9వ తేదీ వరకు వినతులు స్వీకరిస్తుందని ఆయన వెల్లడించారు. విజయవాడలోని కోనేరు లక్ష్మయ్య వీధి, మొఘల్రాజపురం, విజయవాడ 520010, గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలోని మొదటి అంతస్తులో కమిషన్ ప్రతినిధులు ఉంటారని చెప్పారు. కార్యాలయ పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అందుబాటులో ఉంటారని వెల్లడించారు.
తమ అభిప్రాయాలను వ్యక్తిగతంగా ఇవ్వవచ్చని చెప్పారు. లేదా రిజిస్టార్ పోస్ట్ ద్వారా లేదా ఈ మెయిల్ ఐడీ omcscsubclassificaton@gmail. com సమాచారం పంపడానికి అవకాశం ఉందని ఆయన తెలిపారు.

రాయితీపై సూక్ష్మసేద్యం పరికరాలు

రాపూరు: రైతులకు రాయితీపై సూక్ష్మసేద్యం పరికరాలను అందజేయనున్నట్లు ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు తెలిపారు. రాపూరు, నవాబుపేట గ్రామాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న సూక్ష్మసేద్యం పరికరాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 9,200 హెక్టార్లకు మైక్రో ఇరిగేషన్ పరికరాలను అందించడమే లక్ష్యమని తెలిపారు. ఇప్పటి వరకు 9,824 హెక్టార్లకు సంబంధించి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఐదు ఎకరాలలోపు వారికి 90 శాతం సబ్సిడీ అందిస్తామని, 5 నుంచి 10 ఎకరాలు ఉన్న వారికి 70 శాతం సబ్సిడీ ఇస్తామన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రాపూరు ప్రభుత్వ బాలికల వసతి గృహన్ని తనిఖీ చేశారు. జిల్లాలో పలు భవనాల మరమ్మతుకు రూ.10.16 కోట్ల నిధులు అవసరమని ప్రభుత్వానికి నివేదిక అందించామని, అనుమతులు రాగానే మరమ్మతు చేయిస్తామన్నారు. ఆయన వెంట ఏడీ శివనాయక్, ఏఓ సోమసుందర్ ఉన్నారు.

ఏడు గంగలకు ముక్కంటి సారె

శ్రీకాళహస్తి: జాతర సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ఏడు గంగమ్మలకు ముక్కంటి సారెను మంగళవారం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అలంకారమండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మండపం వద్ద సారెను ఉంచి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మేళతాళాల నడుమ ఆలయంలోని పాతాళ గణపతి ఆలయం వద్ద ఉన్న వాహన మండపం, గాలిగోపురం, తేరువీధి, బియ్యపు కృష్ణారెడ్డి మండపం, పెండ్లిమండపం, ముత్యాలమ్మగుడివీధి మీదుగా ఏడుగంగమ్మల గుడి వద్దకు ఊరేగింపుగా చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలు సారె సమర్పించేందుకు వెళుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, సతీమణి రిషితారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పాదాలు కడిగి స్వాగతం పలికారు. అనంతరం ఏడుగంగమ్మల గుడి వద్ద సారెను ఏడుగంగమ్మలకు సమర్పించారు. అక్కడ ఏడు గంగమ్మల అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సారెను అందజేశారు.



సిలికా టిప్పర్ సీజ్

సాక్షి ఎఫెక్ట్..

చిల్లకూరు: తీర ప్రాంతంలో అధికార పార్టీకి చెందిన నాయకులు అక్రమంగా సిలికాను తరలించి సొమ్ము చేసుకుంటున్న అంశంపై 'కేసులేవ్.. సిలికాసులే' అనే శీర్షికన ఆదివారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సోమవారం రాత్రి వరగలి ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలియని అక్రమార్కులు ఒక టిప్పర్ సిలికాను నింపుకుని బెంగళూరుకు బయలు దేరారు. అయితే ఎస్‌బీ పోలీసులు రామారెడ్డిపాళెం వద్దకు వచ్చే సరికే టిప్పర్ డ్రైవర్‌కు అక్రమార్కులు సమాచారం ఇవ్వడంతో టిప్పర్‌లోని 40 టన్నుల సిలికాను రోడ్డు పక్కనే అన్‌లోడ్ చేసేశారు. అయినా పోలీసులు టిప్పర్ సీజ్ చేసి, చిల్లకూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



ఎస్‌బీ పోలీసులకు పట్టుబడిన టిప్పర్

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో తిరుపతి విద్యార్థి ప్రతిభ

తిరుపతి రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో తిరుపతి జీఎస్ఆర్ మాగ్నెట్ స్కూల్ విద్యార్థి చేతన్‌రెడ్డి అద్భుత ప్రతిభ చూపి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. 76 కిలోల విభాగంలో రాష్ట్ర చాంపియన్‌గా నిలిచాడు. దీంతో ఢిల్లీలో ఈ నెల 15వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. చేతన్‌రెడ్డి మాగ్నెట్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొనేందుకు మంగళవారం తిరుపతి నుంచి ఢిల్లీకి బయలుదేరిన చేతన్‌రెడ్డిని స్కూల్ చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డి, డైరెక్టర్ సునీతరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణతో కూడిన క్రీడా పాఠ్యప్రణాళికతో స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయిలో వివిధ క్రీడల్లో రాణిస్తున్నారని స్కూల్ చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డి తెలిపారు.



చేతన్‌రెడ్డిని అభినందిస్తున్న చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డి, ఉపాధ్యాయులు

ఉద్యోగ నైపుణ్యతకు ప్రత్యేక శిక్షణ

–15 వరకు దరఖాస్తుల స్వీకరణ..అదేరోజు శిక్షణ ప్రారంభం

తిరుపతి అర్బన్: విద్యార్హతను బట్టి ఉద్యోగ నైపుణ్యత సాధించడానికి వీ లుగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ విభాగం జిల్లా అధికారి లోకనాథం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీఎన్ఎం మూడేళ్లు, బీఎస్సీ నర్సింగ్ రెండేళ్లు చదువుకున్న వారిని జర్మనీ దేశానికి పంపడానికి ఆరు నెలలపాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చె ప్పారు. 35ఏళ్ల లోపు ఉన్నవారు అర్హులని, స్విమ్స్ నర్సింగ్ కళాశాల వద్ద శిక్షణ ఇస్తామని, జర్మనీ భాషను సైతం నేర్పిస్తారని పేర్కొన్నారు. శిక్షణా సమయంలో ఉచితంగా భోజన వసతులు కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు బయోడేటాతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్, జనన ధ్రువీకరణ పత్రం, అనుభవ సర్టిఫికెట్, వివాహ ధ్రువీకరణ పత్రం, నోటరీ లెటర్, నర్సింగ్ కౌన్సిల్ సర్టిఫికెట్ మొదలైన సమర్పించాలని కోరారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉందని, అదే రోజు మధ్యాహ్నం నుంచి శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదనపు సమాచారం కోసం 9160912690 నంబర్‌ను సంప్రదించాలని కోరారు

నెల్లూరు బాలసదన్ బాలికలు తడలో ప్రత్యక్షం

తడ: వివిధ కారణాలతో కుటుంబానికి, అయినవారికి దూరంగా నెల్లూరు వేదాయపాళెంలోని బాలసదన్‌లో ఉంటున్న ముగ్గురు బాలికలు మంగళవారం రాత్రి తడ రైల్వేస్టేషన్‌లో ప్రత్యక్షం అయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 15 నుంచి 17 ఏళ్ల బాలికలు ముగ్గురు మంగళవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో తడ రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు బాలికల కోసం గాలించారు. బజారు నుంచి సూళ్లూరుపేటకు వెళ్లేందుకు వారు ఆటోకోసం ఎదురుచూస్తుండగా గుర్తించి విచారించారు. నెల్లూరు వేదాయపాళెంలోని బాలసదన్ నుంచి మంగళవారం మధ్యాహ్నం పారిపోయి వచ్చినట్టు తెలుసుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చి బాలసదన్‌కు సమాచారం అందించారు. వారిని ఎందుకు పారిపోయి వచ్చారని పోలీసులు విచారించగా బాలసదన్‌లో తమకు అందించే ఆహారం బాగా లేదని, బాలికల పట్ల సిబ్బంది వ్య వహ రించే తీరు కూడా నచ్చక మొదట పీడీ వద్దకు వెళ్లి ఫిర్యాదు చే యాలనుకున్నామని, మళ్లీ వద్దనుకుని పారిపోయి వచ్చినట్టు తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

రేణిగుంట: రేణిగుంట–శ్రీకాళహస్తి మార్గంలోని ఆర్.మల్లవరం సమీపంలో మంగళవారం రాత్రి రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు అర్బన్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. వైఎస్సార్ జిల్లా ఎర్రముక్కపల్లెకు చెందిన పసుపులేటి కృష్ణుడు(60) ఆర్.మల్లవరంలోని ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి హోటల్ నుంచి ఎదురుగా ఉన్న షాపులో టీ తాగేందుకు రోడ్డు దాటుతుండగా, శ్రీకాళహస్తి వైపు వెళుతున్న బైక్ అతడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్యకళాశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సంఘటన స్థలంలో కృష్ణుడు మృతదేహం